క్వాలిఫయర్-2 | పంజాబ్ X ముంబై రా.7.30 నుంచి | వేదిక అహ్మదాబాద్



# భారత్‌కు 24 పతకాలు

**సచిన్, పారుల్ వెండి వెలుగులు • మహిళల 4X100లో నిత్యకు కాంస్యం • ముగిసిన ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్**





సచిన్



అనిమేశ్

గుమి(దక్షిణకొరియా): ప్రతిష్ఠాత్మక ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను భారత్ ఘనంగా ముగించింది. అంచనాలకు మించి రాణిస్తూ భారత అథ్లెట్లు 24 పతకాలతో సత్తా చాటారు. టోర్నీ మొత్తమ్మీద భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 6 కాంస్య పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. చైనా(19 స్వర్ణాలు, 9 రజతాలు, 4కాంస్యాలు), జపాన్(5 స్వర్ణాలు, 11 రజతాలు, 12 కాంస్యాలు) వరుసగా ఒకటి, మూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి. పోటీలకు ఆఖరి రోజైన శనివారం వేర్వేరు ఈవెంట్లలో మన అథ్లెట్లు ఆరు పతకాలు ఖాతాలో వేసుకున్నారు. మహిళల 4X100 మీటర్ల రిలే రేసులో తెలంగాణ యువ అథ్లెట్ నిత్య గందె, అభినయ రాజరాజన్, స్నేహ ఎస్ఎస్, సర్బనీ నందతో కూడిన భారత బృందం సీజన్ బెస్ట్ నమోదు చేస్తూ 43.86సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంతో రజత పతకం దక్కించుకుంది. చైనా(43.28సె), థాయ్‌లాండ్(44.26సె) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాయి. ఈ పోటీలో నిత్య అద్భుత ప్రదర్శన కనబరుస్తూ రజతం దక్కడంలో కీలకమైంది. మరోవైపు మహిళల 5000మీటర్ల రేసులో పారుల్ చౌదరీ 15:15:33సెకన్ల టైమింగ్‌తో రజతం ఖాతాలో వేసుకుంది. పురుషుల జావెలిన్‌త్రోలో సచిన్ యాదవ్ 85.16మీటర్ల దూరంతో రజతం సొంతం చేసుకున్నాడు. పురుషుల 200మీటర్ల రేసును అనిమేశ్ కుజూర్ జాతీయ రికార్డు టైమింగ్ 20.32 సెకన్లతో కాంస్యం కైవసం చేసుకున్నాడు. మహిళల 800మీటర్ల రేసులో పూజ తన అత్యుత్తమ వ్యక్తిగత టైమింగ్(2:01:89సె)తో కాంస్యం దక్కించుకోగా, 400మీటర్ల హర్డిల్స్‌లో విత్యారామ్‌రాజ్ కాంస్యం కైవసం చేసుకుంది.



## దబాంగ్ ఢిల్లీ బోణీ

**అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ లీగ్**

అహ్మదాబాద్: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ)లో దబాంగ్ ఢిల్లీ అదిరిపోయే బోణీ కొట్టింది. శనివారం మొదలైన లీగ్‌లో మాజీ చాంపియన్ ఢిల్లీ తమ తొలి మ్యాచ్‌లో జైపూర్ పాట్రియాట్స్‌పై 11-4 తేడాతో ఘన విజయం సాధజంచింది. పురుషుల సింగిల్స్ తొలి గేమ్‌లో క్వెక్ ఇజాక్ 2-1తో కనాక్ జాపై గెలిచి ఢిల్లీకి శుభారంభం అందించాడు. అయితే మహిళల సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్ ఆకుల శ్రీజ 2-1తో మారియ జావోపై గెలిచి జైపూర్‌ను పోటీలోకి తీసుకొచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఢిల్లీ జోడీ సాతియాన్ జ్ఞానశేఖరన్, జావో 3-0తో శ్రీజ, జా ద్వయంపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో జ్ఞానశేఖరన్ 3-0తో జీత్ చంద్రను చిత్తు చేశాడు. దీంతో ఢిల్లీ విజయం ఖరారైంది.

## లలిత్ స్వర్ణ ధమాకా

అహ్మదాబాద్: ప్రతిభకు వయసు అడ్డంకి కాదని నిరూపించాడు అహ్మదాబాద్‌కు చెందిన వెటరన్ పవర్‌లిఫ్టర్ లలిత్ పటేల్. థాయ్‌లాండ్‌లోని పట్టాయలో జరిగిన ఐబీబీఎఫ్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో లలిత్ మూడు స్వర్ణ పతకాలతో మెరిశాడు. మాస్టర్2 కేటగిరీ(83-93కి)లో పోటీపడ్డ పటేల్..బ్రెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్, స్క్వాట్ ఈవెంట్లలో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ మెగాటోర్నీ కోసం లలిత్ ఎనిమిది నెలల పాటు కఠోర శిక్షణ తీసుకున్నాడు. ఐదేండ్ల కిందట పవర్ లిఫ్టింగ్‌ను కెరీర్‌గా తీసుకున్న లలిత్ అనతికాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాడు.



# పంజాబ్ X ముంబై

**నేడు ఐపీఎల్ క్వాలిఫయర్-2 పోరు • ఫైనల్ బెర్తుపై ఇరు జట్ల నజర్**

**ఐపీఎల్‌లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఫైనల్లోకి దూసుకెళ్లగా, మరో బెర్తు కోసం పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ముఖాముఖి తలపడనున్నాయి. నేడు జరిగే క్వాలిఫయర్-2లో సత్తాచాటి ఆర్‌సీబీతో ఆఖరి పోరుకు ఇరు జట్లు పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యాయి. ఆర్‌సీబీ చేతిలో భారీ ఓటమి ఎదుర్కొన్న పంజాబ్ ఓవైపు అయితే, గుజరాత్ టైటాన్స్‌ను నాకౌట్ చేసిన ముంబై ఇండియన్స్ మరోవైపు సై అంటే సై అంటున్నాయి. సుదీర్ఘ లీగ్ చరిత్రలో ఇప్పటి వరకు టైటిల్ గెలువని పంజాబ్..ఐదు సార్లు చాంపియన్ ముంబైని ఏ మేరకు నిలువరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.**



అహ్మదాబాద్: ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య క్వాలిఫయర్-2 పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం ఇరు జట్ల కీలక పోరు జరుగనుంది. ఫైనల్ బెర్తు ఖరారు చేసే ఈ పోరులో ఎలాగైనా గెలిచి ఆర్‌సీబీతో తలపడేందుకు పంజాబ్, ముంబై తహతహలాడుతున్నాయి. లీగ్ దశలో పంజాబ్ టాప్‌లో నిలిస్తే..ఆదిలో వరుస ఓటములు ఎదుర్కొని అద్భుతంగా పుంజుకున్న ముంబై ప్లేఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఒత్తిడిని అధిగమించడంలో తమకు తామే సాటి అని నిరూపిస్తూ ముంబై ముచ్చటగా ఆరోసారి ఐపీఎల్ టైటిల్‌ను దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది. మరోవైపు గత 17 సీజన్లుగా తమకు అందని ద్రాక్షగానే మిగిలిపోయిన టైటిల్‌ను ఈసారైనా ఒడిసిపట్టుకోవాలని అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ చూస్తున్నది.

**పంజాబ్:** లీగ్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న పంజాబ్ తమ సుదర్ఘీ కలను సాకారం చేసుకునేందుకు మరో అడుగు దూరంలో ఉంది. లీగ్ దశలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తూ అద్భుత విజయాలతో అగ్రస్థానంలో నిలిచిన పంజాబ్..క్వాలిఫయర్-1లో ఆర్‌సీబీ చేతిలో భారీ ఓటమి ఎదుర్కొంది. దీన్నుంచి తేరుకుని ముంబైని నిలువరించాలన్న పట్టుదలతో ఉన్న కింగ్స్ తమదైన రోజున ఎంతటి ప్రత్యర్థినైనా మట్టికరిపించడంలో ముందుంటుంది. అనుభవం లేకపోయినా అవకాశాలను అందిపుచ్చుకుంటూ యువ క్రికెటర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ప్రియాంశ్, ప్రభ్‌సిమ్రన్, శశాంక్, నేహల్ వధేరా, అయ్యర్ పుంజుకుంటే ముంబైకి కష్టాలు తప్పకపోవచ్చు. గాయం నుంచి తేరుకున్న స్టార్ స్పిన్నర్ చాహల్ చేరిక పంజాబ్‌కు లాభించేదే.

**ముంబై:** రికార్డు స్థాయిలో ఆరో టైటిల్‌పై కన్నేసిన ముంబై అందుకు తగ్గట్లు అడుగులు వేస్తున్నది. ఎలిమినేటర్‌లో గుజరాత్‌ను చిత్తు చేసిన ముంబై..పంజాబ్‌కు చెక్ పెట్టాలని చూస్తున్నది. రోహిత్‌శర్మ, సూర్యకుమార్ సూపర్ ఫామ్‌మీదుండగా, తిలక్‌వర్మ, హార్దిక్, బెయిర్‌స్టో, నమన్‌తో బలంగా కనిపిస్తున్నది.



## కరణ్ డబుల్ సెంచరీ

**భారత్ 'ఏ' తొలి ఇన్నింగ్స్ 557 ఆలౌట్**

కాంటర్‌బూరీ(ఇంగ్లండ్): టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న అనధికారిక టెస్టులో భారత 'ఏ' స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తున్నది. ఓవర్‌నైట్ స్కోరు 409/3 రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన యువ భారత్ 557 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ కరణ్ నాయర్(281 బంతుల్లో 204, 26ఫోర్లు, సిక్స్) డబుల్ సెంచరీతో కదంతొక్కాడు. ఇంగ్లండ్ ద్వితీయ శ్రేణి బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ కరణ్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. జురెల్(94) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. జోష్ హల్, జమాన్ అక్తర్ మూడేసి వికెట్లు తీశారు.

# సాత్విక్ జోడీ పోరు ముగిసె

**సెమీస్‌లో ఓటమి**



సింగపూర్: సింగపూర్ ఓపెన్‌లో భారత స్టార్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-19, 10-21, 18-21తో మలేషియాకు చెందిన ఆరోన్ చియా, సోహ్ వుయ్ యిక్ చేతిలో ఓటమి పాలైంది. టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన సాత్విక్, చిరాగ్ సెమీస్‌లో అదే జోరు కొనసాగించలేకపోయారు. 64 నిమిషాల్లో ముగిసిన పోరులో తొలి గేమ్‌ను దక్కించుకున్న ఈ మాజీ వరల్డ్ నంబర్‌వన్ జోడీ వరుస గేములను చేజార్చుకుని ఓటమివైపు నిలిచారు. ఇటీవలే గాయం నుంచి తేరుకుని తొలిసారి బరిలోకి దిగిన సాత్విక్, చిరాగ్ జంట అంచనాలకు మించి రాణించింది. క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ జోడీని ఓడించిన ఈ స్టార్ ద్వయం సెమీస్ గండాన్ని దాటలేకపోయింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖి పోరులో 3-9తో పోటీకి దిగిన సాత్విక్, చిరాగ్‌కు నిరాశే ఎదురైంది.




## సిన్నర్ జోరు

పారిస్: ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్‌సీడ్ జానిక్ సిన్నర్ జోరు కొనసాగుతున్నది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో ప్రపంచ నంబర్‌వన్ సిన్నర్ 6-0, 6-1, 6-2తో జిరి లెహెకాపై అలవోక విజయం సాధించాడు. తద్వారా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో తన వరుస విజయాల సంఖ్యను 17కు పెంచుకున్నాడు. గంటా 34 నిమిషాల్లో ముగిసిన పోరులో సిన్నర్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు.

# కబడ్డీ సంఘంలో కోట్లు గోల్‌మాల్

**నిధుల దుర్వినియోగంపై మాజీ సంయుక్త కార్యదర్శి ఫిర్యాదు**

**జగదీశ్వర్‌యాదవ్, శ్రీరాములుపై తీవ్ర ఆరోపణలు**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ కబడ్డీ సంఘంలో అలజడి! కోట్లాది రూపాయలు నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ అసోసియేషన్ మాజీ సంయుక్త కార్యదర్శి, జాతీయ కబడ్డీ ప్లేయర్ తోట సురేశ్ సంచలన విషయాలు వెలుగులోకి తీసుకొచ్చాడు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, కోశాధికారి కేబీ శ్రీరాములు గత 40 ఏండ్లుగా అక్రమాలు చేస్తున్నారని శనివారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సురేశ్ ఫిర్యాదు చేశాడు. 2020 నుంచి 2024 వరకు అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించిన సురేశ్..గత కొన్నేండ్లుగా కొనసాగుతున్న అవినీతి అక్రమాలను బహిర్గతం చేశాడు. అంతర్‌జిల్లా కబడ్డీ టోర్నీల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు వారికి చేరకుండా జగదీశ్వర్‌యాదవ్, శ్రీరాములు దుర్వినియోగం చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. శాట్స్ నిధులను పక్కదారి పట్టించడమే కాకుండా సంఘానికి అధికారిక ఖాతా ఉన్నప్పటికీ మరో అనధికారిక ఖాతా ద్వారా 60 లక్షలు విత్‌డ్రా చేశారని సురేశ్ ఆరోపించాడు. ఇదిలా ఉంటే సూర్యాపేటలో 2021లో జరిగిన జాతీయ జూనియర్ కబడ్డీ టోర్నీకి కేటాయించిన రూ.1.20 కోట్లను వృథా చేశారని, అందులో రూ.50 లక్షలు వ్యక్తిగత అవసరాల కోసం వాడుకున్నట్లు ఫిర్యాదులో పొందుపరిచాడు. దీనికి తోడు తెలంగాణ ప్రీమియర్ కబడ్డీ లీగ్ కోసం ఒక సంస్థ ఇచ్చిన 20 లక్షల నిధులను జిల్లా సంఘాలకు ఇవ్వకుండా వాడుకున్నారని పేర్కొన్నాడు. ఏజీఎం, ఈసీ సమావేశాలు లేకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారని సురేశ్ తెలిపాడు. సంఘంలో నిధుల దుర్వినియోగంపై జగదీశ్వర్‌యాదవ్, శ్రీరాములును ప్రశ్నించినందుకు తనను బెదిరిస్తూ మహబూబాబాద్ జిల్లా అసోసియేషన్ నుంచి తొలిగించారని సురేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. అసోసియేషన్ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేదని అన్నాడు. దీనిపై వెంటనే విచారణ చేసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.



## 4.4 కేజీలతో జన్మించిన శిశువు

జూబ్లీహిల్స్, మే 31: రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన రుక్సర్ బేగం(22) రెండో కాన్పులో శనివారం మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువు సుమారు నాలుగున్నర కేజీల బరువు ఉండటంతో అందరూ అవాక్కయ్యారు. శ్రీరామ్ నగర్ ప్రసూతి దవాఖాన మాజీ సూపరింటెండెంట్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమారాణి ఆధ్వర్యంలో తల్లికి.. బిడ్డకు ఎలాంటి హాని జగగకుండా సాధారణ ప్రసవం చేశారు.

## వర్షాధార పంటలను ఎంచుకోవాలి

**రైతులకు రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు సూచన**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించినందున రైతులు నేల స్వభావాన్ని బట్టి వర్షాధార పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ సంచాలకుడు శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుత వర్షాలను వినియోగించుకుని వరి సాగు చేసే రైతులు పచ్చి రొట్ట పైరులు (జనము, జీలుగ, పెసర, పిల్లిపెసర, ఉలవలు) విత్తుకోవాలని సూచించారు. 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షంపడిన తర్వాత తడిచిన నేలలో రైతులు వర్షాధార పంటలైన పత్తి, సోయాచిక్కుడు, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర మొదలగు పంటలను విత్తుకోవాలని పేర్కొన్నారు. మరోవైపు జూన్ నెలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నందున రైతులు వాన నీరు బయటకు వెళ్లేలా నీటి కాల్వలు ఏర్పర్చుకోవాలని కోరారు. వేరుశనగ, సోయ చిక్కుడు, జొన్న, పెసర, కంది, మినుము పంటలను విత్తుకునే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని స్పష్టంచేశారు.

## అహిల్యాబాయి జీవిత చరిత్రపై చిత్రం

ముంబై మే 31 (నమస్తే తెలంగాణ): రాజమాత మాతోశ్రీ అహిల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్రపై మహారాష్ట్ర ప్రభుత్వం తెలుగు, హిందీలతో పాటు బహుభాషా చిత్రాన్ని నిర్మిస్తుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడంచారు. అహల్యాదేవి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకుని అహిల్యానగర్ జిల్లాండిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు.



## అనంతగిరిలో 9వ శతాబ్ది గుహలు

- **పురాతన జైన గుహలుగా గుర్తింపు**
- **చారిత్రక చిహ్నాలను కాపాడాలి**
- **ప్రముఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా అనంతగిరిలో 9వ శతాబ్దానికి చెందిన 15 జైన గుహల సముదాయాలను కాపాడుకోవాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, పురావస్తు పరిశోధకడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. శనివారం ఆయన అనంతగిరిలోని గుహలను పరిశీలింరు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ గుహలు 2.0 నుంచి 6.0 మీటర్ల పొడవు, 2.0 నుంచి 3.0 మీటర్ల వెడల్పు 2.5 మీటర్ల ఎత్తు కలిగి తూర్పువైపు ద్వారంతో నేలపై రాతి పడకలు కలిగి ఉన్నాయని వివరించారు. వర్షాకాలంలో జైన మునులు ఈ గుహలలో నివసించేవారని, రాతి పడకలపై మరణించేంత వరకు ఆహారం తీసుకోకుండా సల్లేఖన వ్రతాన్ని ఆచరించేవారని తెలిపారు. ఒక గుహలో పద్మాసనంలో ఉన్న జైన తీర్థంకరుడి విగ్రహం వల్ల ఈ గుహలు క్రీ.శ. 9వ శతాబ్ది (రాష్ట్ర కూటులు) కాలానికి చెందనవని తెలిపారు. ఆ జైన గుహలను కాపాడాలని అక్కడి ఆలయ చైర్మన్ డాక్టర్ పద్మనాభాన్ని, వికారాబాద్ మున్సిపల్ అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో వారసత్వ కార్యకర్తలు డీఆర్ శ్యాంసుందర్‌రావు, బీ వెంకట్‌రెడ్డి, బీ సాయికిరణ్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

## వాట్సాప్‌లో నాలుగు కొత్త ఫీచర్లు



న్యూఢిల్లీ: ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో కొత్తగా నాలుగు ఫీచర్లు చేరబోతున్నాయి. వాట్సాప్ మాతృ సంస్థ మెటా తన బ్లాగ్‌లో తెలిపిన వివరాల ప్రకారం, కొల్లేజ్, మోర్ విత్ మ్యూజిక్, స్టిక్కర్స్, యాడ్ యువర్స్ అనే కొత్త ఫీచర్లు రాబోతున్నాయి. కొల్లేజ్ ద్వారా యూజర్లు గరిష్ఠంగా ఆరు ఫొటోలను ఉపయోగించి తమకు నచ్చిన లేఅవుట్‌తో కొల్లేజ్‌ను రూపొందించవచ్చు. ఎడిటింగ్ టూల్స్‌తో స్టేటస్‌లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చు. 'మోర్ విత్ మ్యూజిక్' ద్వారా వాట్సాప్ యూజర్లు ఒక పాటను నేరుగా తమ స్టేటస్‌గా పెట్టుకోవచ్చు. 'స్టిక్కర్' ఫీచర్ ద్వారా ఫొటోలను స్టిక్కర్లుగా మార్చుకోవచ్చు. యూజర్లకు నచ్చిన విధంగా స్టైలింగ్ చేసుకుని స్టిక్కర్లను స్టేటస్‌లో పోస్ట్ చేయవచ్చు. 'యాడ్ యువర్స్' ఫీచర్ ద్వారా స్టేటస్ సంభాషణలో స్నేహితులను చేర్చుకోవచ్చు.

వాణిజ్య

# కార్ల సందడే..సందడి





**జూన్‌లో విడుదలకానున్న నాలుగు నూతన మాడళ్లు**

న్యూఢిల్లీ, మే 31: దేశీయ రోడ్లపై మరిన్ని నూతన కార్లు దూసుకుపోవడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి పలు మాడళ్లను విడుదల చేసిన దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ సంస్థలు మరిన్ని మాడళ్లను విడుదల చేయడానికి రెడీ అవుతున్నాయి. జూన్ నెలలో నాలుగు నూతన కార్లు అందుబాటులోకి రాబోతున్నాయి. వీటిలో ఈవీతోపాటు ఎస్‌యూవీ, లగ్జరీ కార్లు ఉన్నాయి. దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టాటా మోటర్స్ సరికొత్త మాడల్‌ను పరిచయం చేస్తున్నది. ఈ వివరాలు...

**టాటా హారియర్ ఈవీ**

ఈ ఏడాది జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రదర్శించిన హారియర్ ఈవీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమైంది టాటా మోటర్స్. జూన్ 3న విడుదలకానున్న ఈ మాడల్ ధర రూ.25 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే ఈ మాడల్‌లో 10.25 ఇంచుల డిస్‌ప్లే, పనోరమిక్ సన్‌రూఫ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్‌తో 10 స్పీకర్లు, ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా, ముందు-వెనుక రియర్ పార్కింగ్ సెన్సార్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారుచేసింది.

**ఎంజీ సైబర్‌స్టార్**

మరో ఈవీని విడుదల చేయడానికి సిద్ధమైంది ఎంజీ. సైబర్‌స్టార్ పేరుతో విడుదల చేయనున్న ఈ మాడల్ ధర రూ.50 లక్షల స్థాయిలో ఉండనున్నట్టు అంచనా. రెండు డోర్లు, ఎల్ఈడీ హెడ్‌లైట్స్, 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్, డిస్‌ప్లేతో ఏసీ కంట్రోల్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, లెవల్-2 ఏడీఏఎస్ ఫీచర్, 77 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ 443 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.

**ఎంజీ ఎం9**

ఎంజీ మరో మల్టీపర్పస్ వాహనమైన ఎం9ను పరిచయం చేయబోతున్నది. ఈ కారు ధర రూ.70 లక్షలుగా అంచనా. ఆరుగురు లేదా ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ మాడల్‌లో 90 కిలోవాట్ల బ్యాటరీతో సింగిల్ చార్జింగ్‌తో 400 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

**ప్రత్యేక ఎడిషన్‌గా బెంజ్ కారు**

మెర్సిడెజ్ బెంజ్ నూతన ఏఎంజీ జీ 63 మాడల్‌ను ఆధునీకరించి మళ్లీ విడుదల చేస్తున్నది. వచ్చే నెల 12న విడుదలకానున్న ఈ మాడల్ ధర రూ.3.50 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. 4 లీటర్ల ట్విన్-టర్బో వీ8 పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారులో డ్రైవర్ వైపు 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్, మధ్యలో 11.9 ఇంచుల మరో టచ్‌స్క్రీన్, కేవలం 10.9 సెకండ్లలో 200 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 318 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

## ఖాతాదారులకు కెనరా బ్యాంక్ ఊరట



బెంగళూరు, మే 31: ప్రభుత్వ రంగ సంస్థ కెనరా బ్యాంక్ తన ఖాతాదారులకు శుభవార్తను అందించింది. కనీస నగదు నిల్వలు లేని అన్ని రకాల ఎస్బీ ఖాతాలపై విధించే చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు ప్రకటించింది. పొదుపు ఖాతాతోపాటు వేతన ఖాతా, ఎన్ఆర్ఐ ఎస్బీ ఖాతాల్లో కనీస నిల్వలు లేకున్నా వీరిపై జరిమానా విధించడం లేదని బ్యాంక్ చైర్మన్ సత్యనారాయణ రాజు వెల్లడించారు.

## లాభాల్లో బ్రైట్‌కామ్

హైదరాబాద్, మే 31: బ్రైట్‌కామ్ గ్రూపు అంచనాలకుమించి రాణించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన మూడింతలు పెరిగి రూ.120.68 కోట్లకు ఎగబాకినట్టు ప్రకటించింది. కంపెనీ ఆదాయం రూ.987.48 కోట్లకు చేరుకున్నది.

## తగ్గనున్న వంటనూనెల ధరలు!

*క్రూడ్‌పై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గించిన కేంద్రం*



న్యూఢిల్లీ, మే 31: వంటనూనెల ధరలు మరింత తగ్గబోతున్నాయి. క్రూడ్ పామాయిల్, క్రూడ్ సోయబిన్ ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం వరకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో దేశీయంగా వంటనూనెల రిటైల్ ధరలు మరింత తగ్గనున్నాయి. ఈ మూడు వంటనూనెలపై గతంలో 20 శాతం దిగుమతి సుంకాన్ని వసూలు చేసిన కేంద్రం..తాజాగా దీనిని 10 శాతానికి దించింది. దేశీయంగా వినియోగిస్తున్న వంటనూనెల్లో 50 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో 159.6 లక్షల టన్నుల వంటనూనెలను దిగుమతి చేసుకున్నది. వీటి విలువ రూ.1.32 లక్షల కోట్లు. వంటనూనెల దిగుమతులపై తగ్గించిన దిగుమతి సుంకం వెంటనే అమలులోకి వచ్చిందని తెలిపింది. ఈ మూడు వంటనూనెలపై దిగుమతి సుంకం(బేసిక్ కస్టమ్ డ్యూటీ, ఇతర చార్జీలు) కలుపుకొని మొత్తంగా 27.5 శాతం వసూలు చేస్తుండగా, తాజా నిర్ణయంతో 16.5 శాతానికి దిగొచ్చింది. కానీ, రిఫైన్డ్ ఆయిల్‌పై వసూలు చేస్తున్న 32.5 శాతం దిగుమతి సుంకాన్ని యథాతథంగా ఉంచింది. వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఇండియన్ విజిటేబుల్ ఆయిల్ ప్రొడ్యుసర్స్ అసోసియేషన్ స్వాగతించింది.

**పెంచమంటే..తగ్గించారు..**

దిగుమతి చేసుకునే వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరితే..కేంద్ర ప్రభుత్వం మాత్రం తగ్గించిందని ఎస్ఈఏ ప్రెసిడెంట్ మెహతా అస్థానా ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ ప్రాసెసింగ్ సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచాలని గతంలోనే కేంద్రాన్ని కోరినప్పటికీ ప్రస్తుతం దీనిని 10 శాతానికి దించడం సబబుకాదని విమర్శించారు.

## హైదరాబాద్‌లో అపర్ణ మరో ప్రాజెక్టు

హైదరాబాద్, మే 31: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్ అండ్ ఎస్టేట్..హైదరాబాద్‌లో మరో భారీ ప్రాజెక్టును చేపట్టబోతున్నది. రూ.2,200 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఈ నూతన లగ్జరీ హౌజింగ్ ప్రాజెక్ట్‌ను గోపన్‌పల్లి-గచ్చిబౌలిలో 22.28 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నట్లు కంపెనీ ఎండీ ఎస్ఎస్ రెడ్డి తెలిపారు. దీంట్లో 2,088 అపార్ట్‌మెంట్లు ఉండనున్నాయని, వచ్చే మూడేండ్లలో ఈ ప్రాజెక్టు తొలి దశ అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు.

## ఎయిర్ ఇండియా 'పేడే సేల్' ఆఫర్

న్యూఢిల్లీ, మే 31: ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థయైన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..ప్రత్యేకంగా 'పేడే సేల్' ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద విమాన టికెట్లపై 25 శాతం వరకు డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది. జూన్ 3 వరకు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులకు ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. దేశవ్యాప్తంగా జూన్ 7 నుంచి సెప్టెంబర్ 20లోగా, అలాగే అంతర్జాతీయ రూట్లలో జూన్ 3 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రయాణించాల్సివుంటుంది.